క్లుప్తంగా

సీలింగ్ షెడ్‌కు భూమి పూజ



కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సింగోటం గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల కోసం అన్నదాన కార్యక్రమానికి తన సొంత ఖర్చులతో సీలింగ్ షెడ్ నిర్మించడానికి నిర్ణయించారు. అందులో భాగంగా ఆదివారం కార్యకర్తలతో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇమ్రాన్ ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో అన్నదానం



అచ్చంపేట రూరల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో జీబీఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ అరుణ రైతన్నలకు అన్నదానం చేశారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన వేరుశనగ రైతులు మార్కెట్‌కు ధాన్యం తీసుకొస్తున్నారని, మధ్యాహ్నం భోజనం లేక ఆకలితో అలమటించడం గ్రహించి ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, జీబీఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ గువ్వల అమల అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారని ఆమె తెలిపారు. ప్రతి రోజు సుమారు వెయ్యి మందికి పైగా రైతన్నలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు కార్యక్రమంలో మార్కెట్ సెక్రటరీ శ్రీధర్, డైరెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

రుక్కయ్యకు సన్మానం



కల్వకుర్తిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ నూతన డైరెక్టర్‌గా ఎన్నికైన రుక్కయ్య యాదవ్‌ను బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం సన్మానించారు. 35 ఏళ్లుగా ఆయన చేసిన సేవలను గుర్తించి డైరెక్టర్‌గా ఎంపిక చేయడంపై ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు కృతజ్ఞతలు చెబుతున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో గోపాల్, నిరంజన్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి



తాడూరు: మండలంలోని లక్కిరాంతండా, ఇంద్రకల్ గ్రామాలలో బీఆర్‌ఎస్ యువనాయకులు గౌరీకుమార్ ఆధ్వర్యంలో సోషల్‌మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో సమావేశం నిర్వహించి కమిటీని ఏర్పాటు చేసుకుందామన్నారు. కమిటీ సభ్యుల ద్వారా బయోడేటాఫాంను సేకరించి ఎమ్మెల్యేకు అందజేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



తాడూరు: మండలంలోని గుంతకోడూరులో ఆదివారం అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు సర్పంచ్ మాధవి భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి సహాయ, సహకారాలతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటయ్య, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మైసమ్మ జాతరకు తగ్గుతున్న భక్తులు



పెద్దకొత్తపల్లి: మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈనెల 16 తేదీన అకాల వర్షానికి మామిడి తోటలు, వరిపంట నాశనం కావడంతో రైతులు వ్యవసాయ కూలీలు మైసమ్మను దర్శించుకోవడానికి వెళ్లలేదు. భక్తులు లేక మైసమ్మ జాతర వెలవెలబోయింది.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి



అచ్చంపేటలో రిలే నిరాహార దీక్షలో కూర్చున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



బిజినేపల్లిలో అఖిలపక్ష సమావేశానికి హాజరైన నాయకులు

అచ్చంపేట రూరల్: నిఖిత మృతి కేసు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సొట కాశీం డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాశీం మాట్లాడుతూ నిఖిత మృతి హత్య కేసుగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబానికి రూ. 50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, ప్రవీణ్, ఉదయ్, రాంప్రసాద్, రంజిత్, నిఖిత తండ్రి బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించండి

బిజినేపల్లి: అచ్చంపేటలో విద్యార్థి నిఖిత పాఠశాలలోనే చనిపోవడంతో తనకు న్యాయం జరిగేందుకు ఈ నెల 25వ తేదిన ఇచ్చిన బంద్‌కు అఖిల పక్షాలు సహకరించాలని ఆయా పార్టీలకు చెందిన నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం బిజినేపల్లిలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అన్ని పార్టీల నాయకులు పాల్గొన్ని బంద్‌ను విజయవంతం చేయాలని తీర్మానించుకున్నారు. ఆయా పార్టీల నాయకులు గూట విజయ్, శ్రీనివాస్ బహదూర్, కరిగళ్ల దశరథం, రాంచందర్, హనుమంతు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మిద్దె రాములు, భూషయ్య, దేన్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఈనెల 31న ఉస్మానియా యూనివర్సిటీలో జరగనున్న దళితహక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రథమ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొమ్ము భరత్, బండి లక్ష్మీపతిలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక లక్ష్మణాచారి భవనంలో మహాసభల వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించి మాట్లాడారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు దళితుల అభివృద్ధికి కేటాయించాల్సిన 15 శాతం నిధులను ప్రస్తుత ప్రభుత్వాలు కేటాయించకుండా దళితులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కేటాయించినా వాటిని ఖర్చు చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో దళితుల ఆర్థిక సామాజిక, రాజకీయ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం కుల వివక్ష నిర్మూలన కోసం, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను మరింత బలోపేతం చేయడానికి ఆందోళన పోరాటాలు నిర్వహించేందుకు ఈ మహాసభల్లో భవిష్యత్ కార్యచరణను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్, పద్మమ్మ, బాలమ్మ పాల్గొన్నారు.

నేడు మహాధర్నా

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం మహాధర్నా నిర్వహిస్తున్నట్లు బీజేపీ పట్టణాధ్యక్షుడు నర్సింహ తెలిపారు. నిరుద్యోగుల పక్షాన చేపడుతున్న ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి హాజరవుతున్నారన్నారు. 30 లక్షల నిరుద్యోగుల జీవితాలతో చలగాటం ఆడిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పడంతో పాటు నిరుద్యోగ యువకులకు అండగా నిలిచేందుకు నిర్వహిస్తున్న మహాధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే గువ్వల రాక

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రాస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మండలంలోని అని శాఖల అధికారులతో సోమవారం దేవాలయం ఆవరణలో సమన్వయ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ జయసుధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



మురళీధర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. లోటస్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన బీజేపీ వర్క్‌షాప్‌లో ఆయనను ఎమ్మార్పీఎస్ నాయకులు కలిశారు. 2014 ఎన్నికలకు ముందు కేంద్రంలో అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదిస్తామని బీజేపీ ప్రకటించిందని వారు వివరించారు. అధికారంలోకి వచ్చి 9ఏళ్లు కావొస్తున్నప్పటికీ బిల్లును ఆమోదించడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంద నర్సింహమాదిగ, బచ్చలకూర లక్ష్మణ్, కురుమూర్తి, సులిగిరి శ్రీనివాసులు, దేవని రమేష్, బత్తిని కురుమయ్య తదితరులున్నారు.

బీటీ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి



దెబ్బతిన్న తాడూరు- ఉప్పునుంతల రోడ్డు

ఉప్పునుంతల: మండల కేంద్రం నుంచి తాడూరు వరకు ఉన్న బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల కంప చెట్లు కమ్ముకోవడంతోపాటు కొన్ని చోట్ల బీటీ పూర్తిగా లేచిపోయింది. దీంతో రోడ్డుపై వెళ్లడానికి ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మూలమలుపుల వద్ద చెట్లు కమ్ముకొని ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవడంతో తృటిలో ప్రమాదాలు తప్పిపోతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం నుంచి ఈ రోడ్డు మార్గంలోనే పెనిమిళ్ల వరకు ఎక్కువ గ్రామాలకు వెళ్లడానికి అనువుగా ఉంటుంది. దీంతో ప్రతి నిత్యం వాహనాలు ఎక్కువగా ఈ మార్గంలో తిరుగుతుంటాయి. ఈ రోడ్డును ఏడేళ్ల క్రితం బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసి తిరిగి పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయడానికి శ్రద్ధ తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా యాదగిరి

చారకొండ: కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఏర్పడడంతో మండల కేంద్రానికి చెందిన గుండె యాదగిరికి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ ఎన్నిక ఆదివారం వారి నివాసంలో జరగగా ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎంపీపీ నిర్మల విజేందర్ గౌడ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని నాయకులు, పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయాల అభివృద్ధికి చేయూత అందిస్తాం



రాఘవేందర్‌రెడ్డి సన్మానిస్తున్న

వెల్దండ: మండల పరిధిలోని కొట్రలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ రాఘవేందర్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో అసంపూర్తిగా ఉన్న వివిధ దేవాలయాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్య, వైద్య, నిరుద్యోగంపై ప్రత్యేక దృష్టి వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదివే వారికి సహకారం అందిస్తామన్నారు. అదే విధంగా పేదవారికి వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కల్వకుర్తి, ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రిల వద్ద ఉచిత అంబులెన్స్‌లను ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితిలలో పేదలకు అందుబాటులో ఉచితంగా అంబులెన్స్‌లను అందిస్తున్నట్లు వివరించారు. నిరుద్యోగులకు ఉచితంగా కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కొట్రలోని కాటమయ్య దేవాలయం, మైసమ్మ దేవాలయం, పోచమ్మదేవాలయం, చెన్నకేశవ దేవాలయాల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయా కుల సంఘాల నాయకులు రాఘవేందర్‌రెడ్డి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, నాయకులు శ్రీనివాసులు, అల్లాజీ, ఆంజనేయులు, నాగరాజుగౌడ్, రవీందర్‌యాదవ్, మల్లేష్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని అపోలో డయాగ్నోస్టిక్ సెంటర్, లయన్స్ క్లబ్ సహకారంతో ఆదివారం నిర్వహించిన డయాబెటిక్ శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు లయన్ కల్మిచర్ల రమేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో 75 మందికి డయాబిటిక్ కొలస్ట్రాల్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లయన్ శ్రీధర్, కోశాధికారి లయన్ వెంకటేశ్, జాయింట్ సెక్రెటరీ లయన్ మర్యాద శ్రీనివాస్‌రెడ్డి, లయన్ కిషన్, పీఆర్ఓ అప్పాయిపల్లి శ్రీనివాస్, లయన్ జి.శ్రీధర్, లయన్ జి.శ్రీనివాస్, ల్యాబ్ అసిస్టెంట్లు శశిధర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కల్వకుర్తిలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దకొత్తపల్లి: గ్రూపు–1 పరీక్ష పత్రం లీకేజీతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి నవీన్‌కుమార్ నేపథ్యంలో సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలని కోరుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు. పార్టీ మండల నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, కురుమయ్య, రామస్వామి, మురళీధర్‌రెడ్డి, వెంకటస్వామి, నాగబాబు, సాయిబాబు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రూప్–1 పశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్, జిల్లా నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, సింగల్‌విండో డైరెక్టర్లు మట్ట వెంకటయ్యగౌడ్, నరేష్, నాయకులు పుల్లయ్య, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, తిరుపతిరెడ్డి, తావుర్యనాయక్, శ్రీను, రమేష్ ఉన్నారు.

కల్వకుర్తి: పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో ఆదివారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను ఆదివారం కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాము యాదవ్ పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడు ఎల్లారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. అనంతరం సీఎం కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కొత్త రాముడు, సాయిరాంరెడ్డి, చామంతి రాజు, అశోక్ పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర ప్రకటించాలి



మాట్లాడుతున్న దేశ్యానాయక్

అచ్చంపేట రూరల్: పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేశ్యానాయక్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించే మహా సంఘర్షన ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం పట్టణంలో వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జీపుజాతను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, నిర్మల, శంకర్‌నాయక్, వెంకటయ్య, పుల్లయ్య, చంద్రయ్య, రాములమ్మ, గోపాల్, తిరుపతి, అంజయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో ద్వారా సీతారాముల కల్యాణ తలంబ్రాలు

కొల్లాపూర్: శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా భద్రాచలంలో నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవ తలంబ్రాలను ఆర్టీసీ కార్గో ద్వారా భక్తులకు అందించనున్నట్లు కొల్లాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజేశ్వర్ తెలిపారు. రూ.116 చెల్లించి ఆర్టీసీ కార్గో సెంటర్‌లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. కల్యాణోత్సవం ముగిశాక భక్తుల ఇంటివద్దకు తలంబ్రాలను పంపిస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు నంబర్.9154298611ను సంప్రదించాలన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ర్యాలీ



బల్మూర్‌లో జీపుజాతలో మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్

కొల్లాపూర్: సీపీఎం ప్రజా సంఘాల నాయకులు ఆదివారం పట్టణంలో బైక్‌ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ర్యాలీని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివవర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తుందని ఆయన వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకే ఈ యాత్ర చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బూర్గం బాలపీరు, ముంతాజ్‌అలీ, భాస్కర్‌నాయక్, సలీమ్, మహిమూద్, తరుణ్, రామకృష్ణ, రాజు, శ్రీకాంత్ తదితరులున్నారు.

బల్మూర్: కేంద్రంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాడుదామని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని కొండనాగుల, బల్మూర్, అనంతవరం గ్రామాల్లో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు నిర్వహించే సంఘర్షణ ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ జీపుజాత నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మల్లేష్, నిర్మల, లాల్‌అహ్మద్, తిరుపతయ్య, అంజయ్య, దేవేందర్, సత్యం, రైతులు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యానికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

కల్వకుర్తిరూరల్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు సీపీఎం కేంద్రం కమిటీ సభ్యురాలు మాజీ ఎమ్మెల్యే మల్లు స్వరాజ్యానికి ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నివాళులర్పించారు. సీఐటీయూ, యూటీఎఫ్, సీడీపీఎస్, గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ధనిక భూస్వామ్య కుటుంబంలో పుట్టినా దళితులు, అణగారిన వర్గాల కోసం ఆమె అహర్నిశలు పనిచేశారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తుపాకీ పట్టి రజాకార్లకు వ్యతిరేకంగా వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన ధీర వనిత స్వరాజ్యం అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. కార్యక్రమంలో మల్లయ్య, నెహ్రూ ప్రసాద్, శ్రీనివాసులు, జగన్, కుర్మయ్య, వెంకటేశ్వర్లు, లక్కుపతి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీని స్ఫూర్తిగా తీసుకోవాలి



కమిటీ ఏర్పాటు చేస్తున్న నాయకులు

తెలకపల్లి: రాహుల్ గాంధీని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొడిదెల రాము అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెద్దపల్లిలో యూత్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి పిలుపుమేరకు గ్రామ కమిటీలు ఏర్పాటు రాహుల్ గాంధీ స్ఫూర్తితో యువత చైతన్యం కావాలన్నారు. అందుకోసం గ్రామాల్లో యూత్ జోడో బూత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఏఐసీసీ ఇచ్చిన పిలుపులో భాగంగా గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తెలకపల్లి మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్ ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి బూత్‌లో 5 మంది కార్యకర్తలను నియమిస్తున్నామన్నారు. తెలకపల్లి మండల పెద్దపల్లి యూత్ అధ్యక్షుడుగా మహేశ్‌ను ఎన్నుకున్నారు. గ్రామంలో బూత్ కోఆర్డినేటర్లు కె.శేఖర్, ఉపాధ్యక్షులు సుధాకర్, ఉస్సేన్, సాయి, జనరల్ సెక్రెటరీ ఎం.చిన్నారెడ్డి, శ్రీకాంత్, కార్యదర్శులు శ్రీకృష్ణ, ఎం.శేఖర్, సి.రాజు, జి.గణేశ్, కె.సుదర్శన్, ప్రవీణ్, సెక్రెటరీ నరేశ్, ఎండీ సర్వర్, మంగి సుధాకర్, పరమేశ్వర్, జాయింట్ సెక్రెటరీ రవి, అనిల్‌కుమార్, కురుమూర్తి, శేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటయ్య గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సీసీరోడ్డు పనులు



చర్లిటికాలలో సీసీ రోడ్డు పనులు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన నిధులతో సీసీరోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఎంపీపీ శ్రీదేవి తెలిపారు. గ్రామాల వారిగా సీసీరోడ్ల నిర్మాణాలకు మంజూరైన నిధుల వివరాలను ఆమె తెలిపారు. చర్లిటికాలకు రూ.20 లక్షలు, ఆకునెల్లికుదురు రూ.20 లక్షలు, మేడిపూరు రూ.2 లక్షలు, గుట్టలపల్లి రూ.20 లక్షలు, ఐతోలు రూ.20 లక్షలు, పర్వతాయిపల్లి రూ.10 లక్షలు, ఎటిదారిపల్లి రూ.10 లక్షలు, నాగుదేవ్‌పల్లికి రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయన్నారు. పనులను ఆయా గ్రామాల సర్పంచ్ ముమ్మరం చేశారన్నారు.

పౌరాణిక నాటక పురస్కారం అందజేత



శ్రీకరి పౌండేషన్ ఉగాది పురస్కారం అందుకుంటున్న వెంకటపతి

కందనూలు: శ్రీకరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పౌరాణిక నాటక రంగంలో కృషి చేస్తున్న జిల్లా కేంద్రానికి చెందిన కానిస్టేబుల్ వెంకటపతికి శ్రీకరి ఉగాది పురస్కారం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటపతి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంత పని ఒత్తిడి ఉన్నా నాటక రంగంలో పాల్గొనడం అభిరుచి అని చెప్పారు. నా ఎదుగుదలకు గుర్తింపు కళారంగం అని పేర్కొన్నారు. కళారంగంలో శ్రీకరి పురస్కారం రావడం సంతోషంగా ఉందన్నారు.

కృష్ణానది తీరంలో పంటల సాగు



మంచాలకట్టలో నువ్వుల పంట

పెంట్లవెల్లి: ప్రతి ఏడాది కృష్ణానది బ్యాక్ వాటర్ తీసిన తర్వాత మండలంలోని మంచాలకట్ట, జటప్రోల్, మల్లేశ్వరం, సోమశీల, వేముకల్ గ్రామాలలో వందలాది మంది రైతు కుటుంబాలు పంటలు సాగు చేస్తారు. కృష్ణానది నీరు తీసిన తర్వాత ఆ ఒండ్రు మట్టి పొలాలో ముంపునకు గురైన పొలాల్లో రకరకాల పంటలను సాగుచేస్తుంటారు. ముఖ్యంగా నువ్వులు, మినుము, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటలను సాగు చేస్తుంటారు. ఈ ఏడాది అధికమొత్తంలో పంటలను సాగుచేస్తున్నారు.